క్లుప్తంగా

కొనసాగిన వైద్య శిబిరం

మొగల్తూరు: డెంగీ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయనే సమాచారంతో మండలంలోని శేరేపాలెం గ్రామంలో మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు ఏర్పాటుచేసిన వైద్య శిబిరం రెండో రోజు మంగళవారం కొనసాగింది. 16 మంది జ్వరం లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ప్రథమ చికిత్స అందించారు. జ్వరం ఎక్కువగా ఉన్న ముగ్గుర్ని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశామని డాక్టర్ దినేష్ తెలిపారు.

మహిళా ఎస్సైగా నాగలక్ష్మి

మొగల్తూరు: మొగల్తూ రు ఎడిషనల్ మహిళా ఎస్సైగా వై.నాగలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం ట్రాఫిక్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై వచ్చారు.

అగ్నిప్రమాద బాధితులకు వితరణ

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు రూరల్ యాళ్లవాని గరువులో ఆదివారం సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన మైలీ చిట్టిబాబుకు ప్రభుత్వం నుంచి రూ.5 వేలు నగదు, 25 కేజీ బియ్యం, నిత్యావసర సరుకులు అందించామని తహసీల్దార్ యడ్ల దుర్గ కిషోర్ తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ తరుపున స్టీల్ సామాన్లు, టార్పాలిన్‌లు అందించామన్నారు. కార్యక్రమంలో దొడ్డా ఏడుకొండలు, పాముల రజనీకుమార్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రంలో రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవాలని తహసీల్దార్ ఎఫ్ఏ ఫాజిల్ సూచించారు. పోడూరు మండలం పండితవిల్లూరు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ కేవీ నాగదేవి, ఆర్ఐ కందుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ శిబిరం

పెనుగొండ: పోస్టాఫీసులో ఖాతాలు ప్రారంభించేందుకు పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో పెనుమంచిలి పంచాయతీ వద్ద మంగళవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలకు ఎన్పీసీఐ అనుసంధానానికి బ్యాంక్ ఖాతా తప్పనిసరి చేయడంతో పాలకొల్లు ఏఎస్పీ ఏఏ నరసింహారావు ఆదేశాలతో ఈ శిబిరం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో బి.వీ రాంజనేయులు, ఏబీపీ ఎండీ సత్యనారాయణ, పంచాయతీ వెల్ఫేర్ అసిస్టెంట్ జుత్తిగ వెంకన్నలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

పెనుమంట్ర: మండలంలో ఇప్పటి వరకు ముగ్గురుపై కేసు నమోదు చేసి, 52 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తణుకు ఎక్సైజ్ సీఐ మణికంఠరెడ్డి పేర్కొన్నారు. నెగ్గిపూడికి చెందిన గెద్దాడ సత్యనారాయణరెడ్డి వద్ద 25 బాటిల్స్, సోమరాజు ఇల్లెందు లపర్రులో గుబ్బల వెంకట సత్యనారాయణ వద్ద 20 సీసాలు, మాముడూరులో వాసంశెట్టి రాంబాబు వద్ద ఏడు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

శిథిలావస్థలో వాతావరణ శాఖ కార్యాలయం

- స్థలం కోసం రెవెన్యూ శాఖకు లేఖ
- 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఫైల్

నరసాపురం: నరసాపురం భారత వాతావరణ శాఖ కార్యాలయం భవనం శిథిలావస్థకు చేరింది. అరకొర సౌకర్యాల మధ్య ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వాతావరణ సమాచారం సేకరించే ఈ కేంద్రంలో వసతులు సరిగాలేక ఖచ్చితమైన సమాచారం సేకరించడానికి సాంకేతికంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా మొత్తానికి ఆటోమేటిక్ వెథర్ స్టేషన్ నరసాపురంలోనే ఉంది. తీర ప్రాంతం కావడం, తరచూ తుఫాన్లు వంటి ప్రకృతి విపత్తులు రావడంతో ముందు ఆలోచనలతో భారత వాతావరణ శాఖ ఇక్కడ కార్యాలయాన్ని నిర్మించింది. ఇక్కడ తప్పిస్తే తూర్పుగోదావరి జిల్లా కాకినాడ, రాజమండ్రి ఎయిర్‌పోర్ట్‌లో మాత్రమే ఈ తరహా కేంద్రాలు ఉన్నాయి. 1982లో ఇక్కడ వాతావరణ సమాచారం సేకరించేందుకు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో భవనం నిర్మించారు. 1984లో స్థానికంగా వాతావరణ శాఖ సేవలు ప్రారంభమయ్యాయి. నాటి నుంచి అదే భవనంలో వాతావరణ శాఖ పని చేస్తుంది.

ఖచ్చిత సమాచారానికి తిప్పలు

వాతావరణ శాఖ భవనం హౌసింగ్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంపైన గదిలో కొనసాగుతోంది. భవనం శిథిలావస్థకు చేరింది. జిల్లాకు సంబంధించి ప్రధానమైన స్టేషన్ ఇది. వర్షపాతం వివరాలతో పాటు, తుఫాన్ల తీవ్రత, ఉష్ణోగ్రతలు, గాలివేగం, గాలిలో తేమశాతం వంటి వివరాలు ఎప్పటి కప్పుడు నమోదు చేస్తారు. సమాచారాన్ని విశాఖపట్టణం, పూనె, హైదరాబాద్ వాతావరణ శాఖ కార్యాలయాలకు చేరవేస్తారు. ఆటోమేటిక్ వెథర్ స్టేషన్ కూడా కార్యాలయం పక్కనే ఉంది. అయితే విలువైన ఈ పరికరాలు ఉన్న ప్రాంతం చుట్టూ చెట్లు పెరిగిపోయాయి. కార్యాలయం కూడా శిథిలావస్థలో ఉండటంతో ఖచ్చిత సమాచారాన్ని రాబట్టడానికి అధికారులు ఇబ్బందులు పడుతున్నారు.



నరసాపురంలో భారత వాతావరణ శాఖ కార్యాలయం

పెండింగ్‌లో ప్రతిపాదనలు

ఎకరం స్థలంలో అధునాతన స్టేషన్, సిబ్బందికి క్వార్టర్స్ నిర్మించాలనే ప్రతిపాదన దాదాపు 13 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉంది. ఎకరం స్థలం కోసం వాతావరణ శాఖ 2011లో నాటి ఉమ్మడి పశ్చిమ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసింది. అయితే రూరల్ ప్రాంతంలో స్థలం ఇస్తామన్నారు. అప్పటి నుంచి ఈ ప్రతిపాదన పెండింగ్‌లోనే ఉంది. ప్రస్తుతం కార్యాలయ భవనం ఉన్న పక్కనే సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న 15 సెంట్ల స్థలాన్ని ఇవ్వాలని మూడేళ్ల క్రితం వాతావరణ శాఖ కోరింది. ఈ మేరకు సబ్‌కలెక్టర్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారు. స్థలం మంజూరు చేస్తే క్వార్టర్స్‌ను మినహాయించి, అధునాతనంగా మూడంతస్తుల్లో వాతావరణ శాఖ కార్యాలయ భవనాన్ని నిర్మిస్తామని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఫైల్ కూడా పెండింగ్‌లోనే ఉంది. మరి వాతావరణ శాఖ నూతన కార్యాలయం భవనానికి ఎప్పుడు మోక్షం వస్తుందో చూడాలి.



చెట్ల మధ్య ఉన్న ఆటోమేటిక్ వెథర్ స్టేషన్

పంటల బీమా పొందాలి

మొగల్తూరు: పంటల బీమా పథకంలో ప్రీమియం చెల్లించి పంటల బీమాను పొందేందుకు అర్హులు కావాలని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి పంట బీమా యోజన పథకంలో ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తున్న రైతులు ప్రీమియం చెల్లించాలని కోరారు. ఎంపిక చేసిన వరి పంట ఎకరాకు రూ.41 వేలు బీమా పొందేందుకు రెండు శాతం ప్రీమియం చెల్లించాలని తెలిపారు. మూడోంతులు రైతు చెల్లిస్తే, ఒక వంతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయని పేర్కొన్నారు. ఎకరాకు రూ.820 ప్రీమియం అనుకుంటే రూ.615 రైతు చెల్లిస్తే, రూ.205 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నుంచి జమవుతుందని తెలిపారు. ఈ ప్రీమియం మొత్తాన్ని అగ్రికల్చర్ ఇన్సురెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియాకు చెల్లించాలని, డిసెంబర్ 31వ తేదీలోగా ప్రీమియం చెల్లించి పంటల బీమా సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా సామూహిక వ్రతాలు

నరసాపురం: స్థానిక ప్రసిద్ధ శ్రీరాజగోపాలస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్తీకమాసంను పురస్కరించుకుని ఆలయంలో ఏటా సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్నారు. ఆలయ ఈఓ కొండేటి రామచంద్రరావు, ప్రధాన అర్చకుడు అంగర శ్రీధర్ పర్యవేక్షణలో వ్రతాలు సాగాయి.

పూర్వ విద్యార్థుల వితరణ

పాలకొల్లు సెంట్రల్: మిత్రుని కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. స్థానిక ఎంఎంకేఎన్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో 1989–1994 బ్యాచ్‌కు చెందిన రుద్రా సుబ్రహ్మణ్యం ఇటీవల క్యాన్సర్ వ్యాధితో మృతి చెందాడు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సుబ్రహ్మణ్య కుటుంబానికి చిన్ననాటి మిత్రులందరూ కలిసి రూ.1 లక్ష సుబ్రహ్మణ్యం కుమార్తె పేరున బ్యాంక్‌లో డిపాజిట్ చేసి తన స్నేహబంధాన్ని చాటుకున్నారు. పదో తరగతి పూర్తయి 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటుచేసిన ఆత్మీయ కలయికలో సుబ్రహ్మణ్యంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మరో 10 మంది మిత్రులకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు పోలిశెట్టి శ్రీశ్రీ, సుదర్శనం శేషుబాబు, దిరిశాల హరగోపాల్, అన్నం బాబ్జి, వేగిరాతి భాస్కర్, బుగ్గే బాబూరావు, వంగా కరుణకుమార్, సోమశేఖర్ గొల్లపల్లి పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యం కుమార్తెకు డిపాజిట్ పత్రం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

అందరికీ సమానమైన విద్య అందాలి

పాలకొల్లు సెంట్రల్: పాత్రికల్లోనే పిడికిలి బిగించి దేశ స్వాతంత్రం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ సుందర్ అధ్యక్షతన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించారు. తొలుత గాంధీ బొమ్మల సెంటర్ నుంచి విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ గత 89 ఏళ్లుగా పేద విద్యార్థులకు ఉచిత విద్య, అందరికీ సమానమైన విద్యా విధానం కావాలని పోరాడుతున్నట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యా విధానం వల్ల పేదలకు విద్య అందని ద్రాక్షలా ఏర్పడిందన్నారు. రేషనలైజేషన్ ద్వారా ఇప్పటికే దేశ వ్యాప్తంగా 60 వేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారని, దీంతో లక్షలాది మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని చెప్పారు. సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌కు మౌలిక వసతులతో సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో విద్యారంగ పరిరక్షణకు పోరాడతామని తెలిపారు. కార్యక్రమంలో కోనాల భీమారావు, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పుష్ప కుమారి, క్రాంతి, యామిని, లోకేష్ కుమార్, చందు, మహిమ, శ్రేయ, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐఎస్ఎఫ్ మహాసభలో మాట్లాడుతున్న శివారెడ్డి

విద్యార్థికి ఆర్థిక సాయం

పాలకొల్లు సెంట్రల్: యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థి వై.అభినయ్‌కు రూ.10 వేల నగదు క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ముచ్చర్ల సంజయ్, గవర్నర్ పెనుమాక రామ్మోహనరావులు చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు జక్కంపూడి మధన్, సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, కానూరి ప్రభాకర్, మంగిన సాయి, కఠారి నాగేంద్రకుమార్, యర్రంశెట్టి వెంకటరత్నం, సంగినీడి రంగారావు, కొండ్రెడ్డి సూరిబాబు, ఇనకొండ శేషాద్రి, ఖగరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించిన అల్లూరి సేవా సమితి

పాలకొల్లు అర్బన్: మండలంలోని జిన్నూరు వంతెన నుంచి గ్రంథాలయం వరకు రోడ్డు గోతులు పడిపోవడంతో గ్రామానికి చెందిన అల్లూరి సేవా సమితి సభ్యులు రూ.1.10 లక్షలు వ్యయం చేసి రోడ్డు నిర్మించారు. దీంతో ప్రజలకు, హైస్కూల్ విద్యార్థులకు అవస్థలు తప్పాయి. ఈ సందర్భంగా అల్లూరి సేవా సమితి సభ్యులకు విద్యార్థులు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ముగ్గురి అరెస్ట్

నరసాపురం రూరల్: ఇటీవల నరసాపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి చిట్టవరం గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్టు రూరల్ సీఐ దుర్గా ప్రసాద్ తెలిపారు. ఈ నెల 8వతేదీ అర్ధరాత్రి కుడిపూడి నాగలక్ష్మి ఇంటిలో చోరీ జరిగిందన్నారు. నాగలక్ష్మి నివాసానికి సమీపంలో ఉంటున్న కోళ్ల సుజాత తనకు పరిచయస్తుడైన యువకుడు వీరవల్లి పవన్‌కుమార్, రాజోలు మండలం కడలి గ్రామానికి చెందిన దొమ్మేటి గోపీనాథ్‌లు నిందితులుగా తేలిందని చెప్పారు. మంగళవారం రాత్రి నిందితులు ముగ్గిరిని అరెస్ట్ చేసి, వారి నుంచి 50.74 గ్రాముల బంగారం, రూ.3,190ల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. కేసును చేధించిన ఎస్సై వెంకట సురేష్, ఏఎస్సై కేవీ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు నరేంద్ర గౌడ్, పుల్లారావు, దుర్గా నాగకుమార్, ధనలక్ష్మి, తేజశ్రీ లను అభినందించారు.

వ్యాధి పీడితురాలికి ఆర్థిక సాయం

పాలకొల్లు అర్బన్: అనారోగ్యంతో బాధపడుతోన్న యలమంచిలి మండలం పెనుమర్రుకి చెందిన కందుల వీరమ్మ కుటుంబానికి వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం అందించింది. వీరమ్మ కుటుంబ ఆర్థిక పరిస్థితిని చైర్మన్ మంతెన వెంకట్రామరాజు దృష్టికి తీసుకువెళ్లడంతో కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు చేతుల మీదుగా రూ.10 వేలు ఆర్థిక సాయం వీరమ్మ భర్త రాఘవులుకి అందజేశారు.

సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

పెనుగొండ: ఇలపర్రు శివారు గుడిపాడు లంకపాలంలోని సత్తెమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం శెట్టిబలిజ యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పితాని సత్యనారాయణ, పెద్దలక్ష్మి దంపతులచే దుంతుకుత సత్యనారాయణ పూజలు చేయించారు. హోమంలు, కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. గురువారం భారీ అన్నసమారాధనతో వార్షికోత్సవం ముగుస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు.

స్నానాల రేవులో కలపా!



పాలకొల్లులోని వెలమగూడెం గాంధీనగర్ ప్రాంతంలో గణపతి ఆలయం ఎదురుగా కర్రలతో దర్శనమిస్తున్న స్నానాల రేవు ఇది. దీంతో మహిళలు వేకువ జామునే పెద్ద కాలువ వరకూ వెళ్లి సాన్నాలు చేసి కార్తీక దీపాలు వదలాల్సి వస్తోంది. ఈ రేవులో కర్రలు తొలగించాలని, కాలువ రేవుల శుభ్రతపై దృష్టి పెట్టాలని మహిళా భక్తులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. - పాలకొల్లు సెంట్రల్

మాముడూరు విద్యార్థినికి జిల్లా ప్రథమం

పెనుమంట్ర: మాముడూరు హైస్కూల్లో పదోతరగతి విద్యార్థిని చెల్లంకిల రేణుక వక్తృత్వ పోటీల్లో జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించిందని ప్రధానోపాధ్యాయుడు కె.రామకృష్ణయ్య మంగళవారం తెలిపారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల భీమవరంలో జరిగిన వక్తృత్వ పోటీల్లో ఆడపిల్లలను రక్షించండి అనే అంశంపై రేణుకకు బహుమతి లభించిందన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతులు మీదుగా రూ.5 వేలు నగదు, మెమెంటో, ప్రశంసా పత్రాన్ని రేణుక అందుకుందని తెలిపారు. రేణుక, ఆమె గైడ్ పితాని హరిబాబును పలువురు అభినందించారు.



కలెక్టర్ నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థిని రేణుక

పొగాకు నష్టాలపై అవగాహన

పాలకొల్లు అర్బన్: పొగాకు వల్ల నష్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మెడికల్ ఆఫీసర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని భగ్గేశ్వరం, పూలపల్లి గ్రామ సచివాలయాల వద్ద క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. పొగాకు ఉత్పత్తులు చుట్ట, సిగరెట్టు, ఖైనీ, గుట్కా వాడడం వల్ల క్యాన్సర్ వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సకాలంలో క్యాన్సర్‌ను గుర్తించి చికిత్స అందిస్తే వ్యాధి నయమవుతుందని తెలిపారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఎం నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్, హెచ్ఎం జీటీ వెంకటకుమార్, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటం

నరసాపురం రూరల్: మండల కేంద్రమైన మొగల్తూరులో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి మరిన్ని పోరాటాలు చేయాలని సీపీఎం మొగల్తూరు మండల మహాసభ తీర్మానించింది. స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన మహాసభలో జిల్లా కార్యవర్గ సభ్యుల కవురు పెద్దిరాజు మాట్లాడారు. మొగల్తూరులో డ్రెయినేజీ సమస్య, మొగల్తూరు నుంచి వెంప రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. తొలుత పార్టీ జెండాను సీనియర్ నాయకులు పాదిల కృష్ణమూర్తి, ఆదూరి సాంబమూర్తిలు ఆవిష్కరించారు. సభలో వీరా పాండు రంగారావు, కొత్తపల్లి నాగరాజు తదితరులు మాట్లాడారు.

ప్రణాళికతోనే సమగ్రాభివృద్ధి

నరసాపురం రూరల్: ప్రణాళికతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని నరసాపురం డీఎల్‌డీఓ ప్రభాకరరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రెండు రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చే నిధులు ప్రణాళిక ప్రకారం ఖర్చు చేస్తే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, సిబ్బంది జీతభత్యాలు మొదలగు వాటికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు, ఈవోపీఆర్డీ కాకర్లమూడి నాగేంద్ర కుమార్‌బాబు, రిసోర్స్ పర్సన్‌లు విశ్వనాథం, బుర్రా ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు రూరల్ పంచాయతీ పరిధిలోని అన్ని హేబిటేషన్లలో పారిశుద్ధ్యం మెరుగుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు పంచాయతీ కార్యదర్శి సీహెచ్ సత్యనారాయణ చెప్పారు. నిత్యం ఉదయం పారిశుద్ధ్యం కార్మికులతో యాళ్లవానిగరువు, నాగరాజుపేట, ముచ్చర్ల పుంత, దొండపేట, పెదగరువు, పండిగుంట, లయన్స్‌నగర్, బ్యాంక్ కాలనీ, సబ్బేవారిపేట, డ్యాంపేట తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లు, రోడ్లు పరిశుభ్రం, చెత్త తరలింపు, ముగ్గు, బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు చెప్పారు. మంచినీరు సరఫరాకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఆహార ఉత్పత్తి పెంపే లక్ష్యం


నరసాపురం రూరల్: ఆహార ఉత్పత్తిని పెంపొందించేందుకు పంట క్షేత్ర దినోత్సవం (ఫీల్డ్ డే) నిర్వహిస్తున్నామని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మంగళవారం నరసాపురం మండలం నవరసపురం గ్రామంలో కృపాదానం అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో ఎంటీయూ–1232 రకం వరి సాగును పరిశీలించారు. ఏడీఏ ఈదా అనిల్ కుమారి అధ్యక్షతన వ్యవసాయ క్షేత్రం వద్ద రైతులతో సమావేశంలో నిర్వహించారు. ఎంటీయూ 1232 రకం అగ్గి తెగులు, సుడిదోమ, మాగుడి తెగులు తట్టుకుంటుందని శాస్త్రవేత్తలు చెప్పారు. దిగుబడి 40 బస్తాలు పైబడి వస్తాయని అంచనా వేస్తున్నామని వివరించారు. అనంతరం ఎల్బీచర్ల రైతు భరోసా కేంద్రం వద్ద తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన ఎంపిక చేసిన 25 మంది రైతులకు 15 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను ఉచితంగా అందజేశారు. కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు చేతుల మీదుగా ఈ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్టేరు వరిపరిశోధనా స్థానానికి చెందిన బ్రీడింగ్ శాస్త్రవేత్త సుధారాణి, మత్స్యశాఖ శాస్త్రవేత్త శ్రీనివాస్, పంటల యాజమాన్య శాస్త్రవేత్త వినయలక్ష్మి, పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి

పెనుగొండ: కూటమి ప్రభుత్వం ట్రూ అప్ పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా పోరు యాత్రలో భాగంగా పెనుగొండ దొంగగూడెం, సిద్ధాంతం చెరువు పేట, కరెంటు ఆఫీస్ కాలనీల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఉపాధి లేక వ్యవసాయ కార్మికులు, వైరల్ జ్వరాలతో ప్రజలు బాధ పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులతో పాటు సిద్ధాంతం కార్యదర్శి కప్పల రత్నరాజు పాల్గొన్నారు.

జాతీయ రగ్బీ పోటీలకు శ్రీజ

నరసాపురం రూరల్: నరసాపురం మండలం తూర్పుతాళ్లు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఈ నెల 9, 10 తేదీల్లో కడప జిల్లా కమలాపురంలో జరిగిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు అండర్ 14 విభాగంలో పాల్గొన్నారు. వీరిలో 8వ తరగతి విద్యార్థిని మేడిది డింపుల్ శ్రీజ జాతీయ రగ్బీ పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు డి.అనిల్ కుమార్ తెలిపారు. త్వరలో బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో జరిగే జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున శ్రీజ పాల్గొననుందని చెప్పారు. వీరికి శిక్షణను ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు అడపా రామకృష్ణ, ఎంపికైన క్రీడాకారులను పేరెంట్స్ కమిటీ చైర్మన్ చామకూరి రాజు, గ్రామ పెద్దలు తదితరులు అభినందించారు.



మేడిది డింపుల్ శ్రీజ

డ్రెయిన్‌లో పారని మురుగు

నరసాపురం : స్థానిక రాయిపేటలో ఆంధ్రాబ్యాంక్ రోడ్డులో ఉన్న డ్రెయిన్‌లో మురుగు పారడంలేదు. దుర్గంధం వెదజల్లుతోంది. అటుగా వెళ్లేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో మునిసిపల్ అధికారులు డ్రెయిన్స్‌లో పూడికతీత పనులు చేపట్టారు. ఈ పనులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. చాలా వరకూ ప్రధాన ప్రాంతాల్లో అలాగే వదిలేశారు. ఆంధ్రాబ్యాంక్ రోడ్డులో పలు విద్యాసంస్థలు ఉన్నాయి. ఇటుగా వెళ్లేవారు ముక్కుమూసుకుని వెళ్లే పరిస్థితి ఏర్పడింది. డ్రెయిన్‌ను శుభ్రం చేసి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.